RNI NO: APTEL/26/A7632

www.mahinewsindia.com

# మహి న్యూస్

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక



ఆంధ్రప్రదేశ్,తెలంగాణ | సంపుటి : 01 | సంచిక : 01 | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య | పేజీలు : 4 | వెల రూ. 2 | సోమవారం -07 - సెప్టెంబర్ - 2026

Published From : Guntur circulated by YSR Kadapa I Anatapuram I Kurnool I East & West Godavari I Chittoor I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana



2లో

ఢిల్లీ మెట్రోలో ప్రధాని మోదీ సర్‌ప్రైజ్..

## చిన్నారులతో సందడి


ఢిల్లీ మెట్రోలో ప్రయాణించి ప్రయాణికులను ఆశ్చర్యపరిచిన ప్రధాని మోదీ

ఎస్ఆర్‌సీసీ శతాబ్ది ఉత్సవాలకు హాజరయ్యేందుకు మెట్రోలో ప్రయాణం

ప్రయాణంలో పాఠశాల విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చట్లు

తన ప్రసంగంలో "దిమాగీ నక్సల్" అనే పదాన్ని ఉపయోగించిన ప్రధాని

## పుతిన్ కీలక నిర్ణయం.. ఉక్రెయిన్‌పై 3 రోజులు దాడులు బంద్



2లో

- ఉక్రెయిన్‌పై దాడులను మూడు రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు రష్యా ప్రకటన
- సైన్యానికి ఆదేశాలు ఇచ్చిన అధ్యక్షుడు పుతిన్
- అమెరికా దౌత్యవేత్తలతో జరగనున్న శాంతి చర్చల నేపథ్యంలో ఈ నిర్ణయం
- చర్చల సమయంలో దాడులు వద్దని జెలెన్‌స్కీ ప్రతిపాదన



2లో

## ఏపీలో 28 జడ్పీలు.. పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వ ఉత్తర్వులు

- రాష్ట్రంలో 13 నుంచి 28కి పెరిగిన జిల్లా పరిషత్‌లు
- కొత్త జడ్పీల పరిధిలోకి 660 మండల పరిషత్‌లు
- అదనంగా 15 సీఈఓ, 15 డిప్యూటీ సీఈఓ పోస్టుల ఏర్పాటు
- సెప్టెంబర్ 24 తర్వాత అమల్లోకి రానున్న పునర్వ్యవస్థీకరణ

## గత పాలకుల నిర్వాకం వల్ల పెళ్లిళ్లను కూడా వాయిదా వేసుకున్నాం: ఏపీ ఉద్యోగులు



2లో

- ఉద్యోగ సంఘాల డిమాండ్లకు సీఎం చంద్రబాబు సానుకూల స్పందన
- 12వ పీఆర్సీ ఏర్పాటు, 2 డీఏల విడుదలకు గ్రీన్ సిగ్నల్
- పెన్షనర్ల ప్రయోజనాలు, పీఎస్‌యూ ఉద్యోగుల పదవీ విరమణ వయసుపై కీలక నిర్ణయాలు
- ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తామని ఉద్యోగుల హామీ

## స్థానిక సమరానికి పవన్ కల్యాణ్ వ్యూహం..

# నియోజకవర్గాల వారీగా కమిటీలు

### స్థానిక సంస్థల ఎన్నికల కోసం జనసేన సమన్వయ కమిటీలు








- పార్లమెంట్ నియోజకవర్గాల ప్రాతిపదికన నియామకాలు
- నేతలు, జనసైనికులను ఎన్నికలకు సిద్ధం చేయడమే లక్ష్యం
- సెప్టెంబర్ 9న మంగళగిరిలో కమిటీ సభ్యులకు అవగాహన

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ సమాయత్తమవుతోంది. ఈ ఎన్నికల నిర్వహణ కోసం పార్టీ సమన్వయ కమిటీలను నియమించింది. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు జనసేన కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. మిగతా 2 లో



2లో

## అండమాన్ దీవులకు కొత్త సారథి.. లెఫ్టినెంట్ గవర్నర్‌గా బీజేపీ నేత దినేశ్ శర్మ

అండమాన్ నికోబార్ కొత్త లెఫ్టినెంట్ గవర్నర్‌గా యూపీ మాజీ డిప్యూటీ సీఎం

నియామకాన్ని ప్రకటించిన రాష్ట్రపతి భవన్

ప్రస్తుత ఎల్జీ డీకే జోషి స్థానంలో బాధ్యతలు


గతంలో యూపీ డిప్యూటీ సీఎంగా పనిచేసిన శర్మ

రాజ్యాంగబద్ధ బాధ్యతగా స్వీకరిస్తున్న దినేశ్ శర్మ

## విద్యార్థుల తీరుపై చంద్రబాబు ఆవేదన.. వివేకంతో వ్యవహరించాలంటూ టీచర్లకు సూచన

### నేటి సున్నిత పరిస్థితుల్లో బోధన టీచర్లకు పెను సవాల్ అని సీఎం చంద్రబాబు అన్నారు

- గతంలో దండించేవారని, ఇప్పుడు మందలించినా ఇబ్బందులేనని వ్యాఖ్యానించారు
- విద్యార్థుల్లో పెరుగుతున్న హింసా ప్రవృత్తి, మానసిక బలహీనతలపై ఆవేదన వ్యక్తం చేశారు
- ఉద్యోగులకు 12వ పీఆర్సీ కమిటీ, రెండు డీఏల విడుదలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది



అమరావతి: గతంలో దండనతో అయినా విద్యార్థులకు పాఠాలు నేర్పించే వీలుండేదని, కానీ నేటి సున్నితమైన పరిస్థితుల్లో కనీసం వారిని మందలించినా ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడంలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు మిగతా 2 లో

## ఎర్రవల్లిలో కీలక భేటీ..

# గులాబీ దళానికి కేసీఆర్ దిశానిర్దేశం!

### అసెంబ్లీ సమరం మొదలుకాక ముందే బీఆర్ఎస్ బరిలోకి

- కాంగ్రెస్ సర్కార్‌ను టార్గెట్ చేసేందుకు అస్త్రశస్త్రాలను సిద్ధం
- కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనపై చర్చించడంతో పాటు, బీఆర్ఎస్ ఇప్పటికే విడుదల చేసిన ఛార్జ్‌షీట్‌పై సభ్యులకు కేసీఆర్ దిశానిర్దేశం



గజ్వేల్: అసెంబ్లీ సమరం మొదలుకాక ముందే బీఆర్ఎస్ బరిలోకి దిగింది.. కాంగ్రెస్ సర్కార్‌ను టార్గెట్ చేసేందుకు అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటోంది. ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం వేదికగా బీఆర్ఎస్ కీలక సమావేశం జరగనుంది. గులాబీ నేత కేసీఆర్ అధ్యక్షతన జరిగే శాసనసభా పక్ష భేటీలో.. మిగతా 2 లో

## హైదరాబాద్‌లో దేశంలోనే

# అతిపెద్ద ఏఐ డేటా సెంటర్

### రూ.70 వేల కోట్ల పెట్టుబడితో టీసీఎస్ అనుబంధ సంస్థ ఏర్పాటు

- తెలంగాణలో టీసీఎస్ భారీ పెట్టుబడి..
- రూ.70 వేల కోట్లతో ఏఐ డేటా సెంటర్
- ఈ ప్రాజెక్టు ద్వారా 7 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి
- ఐదు రాష్ట్రాలతో పోటీపడి ప్రాజెక్టును సాధించిన తెలంగాణ ప్రభుత్వం
- సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనతో సాకారమైన ప్రాజెక్ట్





హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం మరో భారీ పెట్టుబడిని ఆకర్షించింది. దేశంలోనే అతిపెద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ముందుకొచ్చింది. టీసీఎస్ అనుబంధ సంస్థ 'హైపర్‌వోల్ట్' రూ.70,000 కోట్ల పెట్టుబడితో భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ ప్రాజెక్టును నిర్మించనుంది. మిగతా 2 లో

## నేటి నుంచి వర్షాకాల సమావేశాలు..

### కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై దాడికి బీఆర్ఎస్, బీజేపీ వ్యూహం

- అసెంబ్లీలో 'వెయ్యి రోజుల' సమరం!
- విపక్షం దాడి చేయడానికి ముందే.. ఎదురుదాడికి అధికార పార్టీ ప్రణాళిక
- ఫీజు రీయింబర్స్‌మెంట్, 22ఏ జీవో, రైతులు, నిరుద్యోగంపై వాడీవేడి పోరు
- క్యూర్ బిల్లు, హేట్ స్పీచ్ బిల్లు.. 21 ఏళ్లకే చట్టసభల్లో పోటీపై తీర్మానానికి అవకాశం



హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాలు వేడెక్కుతున్న వేళ తెలంగాణ శాసనసభ, మండలి వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం మిగతా 2 లో



2లో

## కొండా సురేఖ రాఖీ కట్టడంపై సీఎం రేవంత్ రెడ్డి ఏమన్నారంటే...!

బీఆర్ఎస్ నేత కేటీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర వ్యక్తిగత విమర్శలు

కొండా సురేఖ రాఖీ కడితే గౌరవించాను, అదే నా సంస్కారం అంటూ వ్యాఖ్య

సొంత చెల్లి రాఖీ కట్టకుండా కేటీఆర్ అమెరికాకు పారిపోయారని విమర్శ

ఆస్పత్రుల్లో వాటా అడుగుతుందని చెల్లిని తరిమేశారని సంచలన వ్యాఖ్యలు

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

# నేటి నుంచి వర్షాకాల సమావేశాలు..

హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాలు వేడెక్కుతున్న వేళ తెలంగాణ శాసనసభ, మండలి వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సమావేశాలు కేవలం బిల్లులు, ప్రశ్నోత్తరాలకే పరిమితం కాకుండా వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై అధికార--ప్రతిపక్షాల మధ్య హోరాహోరీకి వేదికగా మారే అవకాశముంది. ఒకవైపు ప్రభుత్వం తన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడులు, సాగునీటి ప్రాజెక్టులు, నియోజకవర్గాల అభివృద్ధిని ముందుకు తెచ్చేందుకు సిద్ధమవుతుండగా.. మరోవైపు బీఆర్ఎస్, బీజేపీలు ప్రజా సమస్యలు, ఎన్నికల హామీలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఫీజు బకాయిలు, భూ వివాదాలు, జలవనరుల అంశాలతో సర్కారును ఇరుకున పెట్టేందుకు సిద్ధమవుతున్నాయి. అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలన్నది తొలిరోజు స్పీకర్ అధ్యక్షతన జరిగే బీఏసీ భేటీలో ఖరారు కానుంది. నాలుగైదు పనిదినాలకే సమావేశాలు పరిమితమయ్యే అవకాశముంది.

అధికార కాంగ్రెస్ ప్రతిపక్షంపై, ప్రధానంగా ప్రతిపక్ష నాయకుడు సభకు హాజరుకాకపోవడంపై ఇప్పటికే ఆందోళన కార్యక్రమాలను నిర్వహించడమేకాక.. ఆయన రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేస్తోంది. తమ వెయ్యిరోజుల పాలన, బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై గణాంకాలతో చర్చించడానికి సిద్ధమని సవాల్ విసురుతోంది. బీఆర్ఎస్ హయాంలో అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయని, వాటిని చక్కదిద్దుతున్నామని ఎదురుదాడి చేస్తోంది. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన వైఫల్యాల పేరిట బీఆర్ఎస్, బీజేపీలు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్నాయి.

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనను కేంద్రంగా చేసుకుని బీఆర్ఎస్, బీజేపీలు ఇప్పటికే చార్జిట్‌ను విడుదల చేశాయి. రేవంత్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలు, రైతు రుణమాఫీ, ఎరువుల కొరత, రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలుపై బీఆర్ఎస్ ఇప్పటికే క్షేత్ర స్థాయిలో నిలదీస్తోంది. ఉద్యోగాల భర్తీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, సంక్షేమ పథకాలు, సాగునీరు, కృష్ణా--గోదావరి జలాల



అంశాలను ఆ పార్టీ ప్రధానంగా ప్రస్తావిస్తోంది. అసెంబ్లీ వేదికగా వీటిపై ప్రభుత్వాన్ని నిలదీయాలని బీఆర్ఎస్ వ్యూహం సిద్ధం చేసుకుంది.

బీజేపీ కూడా 22ఏ జీవో, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుల సమస్యలను ప్రధాన ఎజెండాగా తీసుకుంది. తాజాగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి నిరసన, అరెస్టు నేపథ్యంలో ఈ అంశం సభలో మరింత వేడెక్కే అవకాశం ఉంది. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలు, కళ్యాణలక్ష్మి నిధుల విడుదలలో జాప్యం, ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు, యూరియా కొరత, రైతుల ఇబ్బందులు కూడా అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలు, జీరో అవర్‌తోపాటు వివిధ రూపాల్లో ప్రస్తావనకు వచ్చే అవకాశముంది.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) బిల్లు ఈ సమావేశాల్లో కీలకంగా మారనుంది. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని పట్టణ ప్రాంతాల పాలనను సమగ్రంగా మార్చే ఉద్దేశంతో ఈ బిల్లును తేనున్నారు. అయితే ఆస్తి పన్ను, భూములు--భవనాల విలువ నిర్ధారణ వంటి అంశాలపై ఇప్పటికే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. మరోవైపు హేట్ స్పీచ్, హేట్ క్రైమ్స్ నిరోధక బిల్లు కూడా చర్చకు రావచ్చు. అలాగే, చట్టసభల ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయసును 25 నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసే అవకాశముంది. 22ఏపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టేలా పూర్తి వివరాలతో అధికారపక్షం సన్నద్ధం అవుతున్నట్లు సమాచారం.

### తెలంగాణలో టీసీఎస్ భారీ పెట్టుబడి..
## రూ.70 వేల కోట్లతో ఏఐ డేటా సెంటర్

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం మరో భారీ పెట్టుబడిని ఆకర్షించింది. దేశంలోనే అతిపెద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ముందుకొచ్చింది. టీసీఎస్ అనుబంధ సంస్థ 'హైపర్‌వోల్ట్' రూ.70,000 కోట్ల పెట్టుబడితో భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ ప్రాజెక్టును నిర్మించనుంది. దీని ద్వారా దాదాపు 7,000 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో తెలంగాణ ప్రభుత్వం, హైపర్‌వోల్ట్ సంస్థ ప్రతినిధుల మధ్య ఒప్పంద పత్రాల మార్పిడి జరిగింది. ఈ ప్రాజెక్టు తెలంగాణకు రావడం చరిత్రాత్మకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ఏడాది జనవరిలో దావోస్‌లో టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌తో జరిపిన సమావేశంలో రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టాలని కోరానని, ఆ కల ఇప్పుడు నెరవేరిందని సీఎం గుర్తుచేసుకున్నారు. తెలంగాణలో ప్రభుత్వాలు మారినా విధానాలు మారవని, పెట్టుబడిదారులకు పూర్తి భరోసా కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఏఐ సాంకేతికత ఎన్ని మార్పులు తెచ్చినా ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్ల వంటి బ్లూకాలర్ ఉద్యోగాలకు ఢోకా ఉండదని, స్కిల్ యూనివర్సిటీ ద్వారా అలాంటి నైపుణ్యాలను ప్రోత్సహిస్తామని తెలిపారు. హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో 264 ఎకరాల విస్తీర్ణంలో ఒక గిగావాట్ సామర్థ్యంతో ఈ ఏఐ డేటా సెంటర్‌ను నిర్మించనున్నారు. 18 నుంచి 24 నెలల్లో ప్రాజెక్టును పూర్తి చేస్తామని కంపెనీ ప్రకటించగా, 2028 జూన్ 2 నాటికి ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. పర్యావరణ హితంగా గ్రీన్ ఎనర్జీతో ఈ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఐదు రాష్ట్రాల నుంచి తీవ్రమైన పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును దక్కించుకోవడం విశేషం.

## ఏపీలో 28 జడ్పీలు.. పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వ ఉత్తర్వులు

అమరావతి: రాష్ట్రంలో జిల్లా ప్రజాపరిషత్‌ల (జడ్పీ) పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఉన్న 13 జడ్పీల స్థానంలో కొత్తగా 28 జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రెండు వేర్వేరు జీవోలను విడుదల చేసింది. కొత్తగా ఏర్పాటయ్యే ఈ 28 జడ్పీల పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా 660 మండల ప్రజాపరిషత్‌లు (ఎంపీపీ) ఉంటాయి. వీటి కార్యకలాపాల నిర్వహణ కోసం ప్రభుత్వం అదనంగా 15 సీఈఓ, 15 డిప్యూటీ సీఈఓ పోస్టులను సృష్టించింది. మిగిలిన మినిస్టీరియల్, సహాయక సిబ్బందిని ప్రస్తుతం ఉన్నవారి నుంచే హేతుబద్ధీకరించి కొత్త జడ్పీలకు కేటాయించనున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న 13 జిల్లా పరిషత్‌ల పదవీకాలం ఈ నెల సెప్టెంబరు 24వ తేదీతో ముగియనుంది. ఆ తర్వాత కొత్త జిల్లాల భౌగోళిక స్వరూపానికి అనుగుణంగా ఈ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ అమల్లోకి వస్తుంది. ప్రతి జిల్లాకు ఒక జడ్పీ చొప్పున పనిచేస్తుంది. భవిష్యత్తులో ఏదైనా మండల పరిషత్ పునర్వ్యవస్థీకరణకు గురైతే, అందుకు అనుగుణంగా జడ్పీ పరిధిలోనూ మార్పులు జరుగుతాయని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

### స్థానిక సమరానికి పవన్ కల్యాణ్ వ్యూహం..
## నియోజకవర్గాల వారీగా కమిటీలు

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ సమాయత్తమవుతోంది. ఈ ఎన్నికల నిర్వహణ కోసం పార్టీ సమన్వయ కమిటీలను నియమించింది. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు జనసేన కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులను, జనసైనికులను, వీరమహిళలను సన్నద్ధం చేసే లక్ష్యంతో ఈ కమిటీలను ఏర్పాటు చేశారు. పార్లమెంట్ నియోజకవర్గాల ప్రాతిపదికన ఈ కమిటీల నియామకం జరిగింది. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక కోఆర్డినేటర్, ముగ్గురు సమన్వయ కమిటీ సభ్యులు ఉంటారు. వీరితో పాటు, ఆ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఒక సహాయకుడిని కూడా ఎంపిక చేశారు. ఈ కమిటీలు తమ పరిధిలోని పార్లమెంట్ నియోజకవర్గాల్లో సమన్వయ బాధ్యతలు నిర్వర్తిస్తాయి. పార్టీ విధానాలకు అనుగుణంగా, పొత్తులోని మిత్రపక్షాలతో కలిసి పనిచేసేలా చూడటం వీరి ప్రధాన విధి. ఈ కమిటీల సభ్యులందరికీ ఈ నెల 9వ తేదీన మంగళగిరిలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశంలో రాబోయే ఎన్నికలపై కమిటీ సభ్యులకు పార్టీ అధినాయకత్వం దిశానిర్దేశం చేయనుంది.


## ఢిల్లీ మెట్రోలో ప్రధాని మోదీ సర్‌ప్రైజ్.. చిన్నారులతో సందడి

ఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం రాత్రి ఢిల్లీ మెట్రోలో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనేందుకు వెళ్తూ ఆయన మెట్రో మార్గాన్ని ఎంచుకోవడం విశేషం. ఈ ఆకస్మిక ప్రయాణంతో తోటి ప్రయాణికులు, ముఖ్యంగా విద్యార్థులు ఆశ్చర్యంతో పాటు అమితానందాన్ని వ్యక్తం చేశారు. శనివారం రాత్రి 7 గంటల సమయంలో ప్రధాని మోదీ ఎల్లో లైన్ మెట్రో కోచ్‌లోకి ఎక్కారు. దాదాపు 20 నిమిషాల పాటు ప్రయాణించి, ఢిల్లీ యూనివర్సిటీ సమీపంలోని విశ్వవిద్యాలయ మెట్రో స్టేషన్‌లో దిగారు. ఈ ప్రయాణంలో ఆయన సాధారణ ప్రయాణికుడిలా మెట్రో కార్డును ఉపయోగించారు. రైలులో ఉన్న చిన్నారులతో కరచాలనం చేస్తూ, పలువురు విద్యార్థులు, మహిళా ప్రయాణికులతో ఆయన ఆప్యాయంగా ముచ్చటించారు. ఒక బాలుడు మోదీ చెవిలో ఏదో చెబుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అనంతరం ఎస్ఆర్‌సీసీలో విద్యార్థులను ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. దేశ ఆర్థిక వృద్ధి, పెరుగుతున్న రక్షణ ఎగుమతులు, నక్సలిజం నిర్మూలన వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. తిరోగమన, అరాచకవాద మనస్తత్వాన్ని విమర్శిస్తూ "దిమాగీ నక్సల్" అనే పదాన్ని ప్రయోగించారు. ఈ కళాశాల పూర్వ విద్యార్థుల ఘనతలతో పోలిస్తే, తాను 'ఆరో ఆటగాడిని' అంటూ ఆయన చమత్కరించారు. ప్రధాని మోదీ మెట్రోలో ప్రయాణించడం ఇది మొదటిసారి కాదు. గతంలో 2023లో ఢిల్లీ యూనివర్సిటీ ఉత్సవాల సందర్భంగా, అలాగే 2024 ఫిబ్రవరిలో మీరట్ మెట్రోలో కూడా ఆయన ఇలాగే ప్రయాణించి సామాన్య ప్రజలతో మమేకమయ్యారు.

## పుతిన్ కీలక నిర్ణయం.. ఉక్రెయిన్‌పై 3 రోజులు దాడులు బంద్

ఢిల్లీ: రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ఒక అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఉక్రెయిన్‌పై దాడులను మూడు రోజుల పాటు తాత్కాలికంగా నిలిపివేయాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తన సైన్యాన్ని ఆదేశించారు. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఈ యుద్ధానికి ముగింపు పలికే దిశగా అమెరికా దౌత్యవేత్తలతో జరగనున్న చర్చలకు ముందు పుతిన్ ఈ నిర్ణయం తీసుకోవడం అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ విషయాన్ని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ అధికారికంగా ప్రకటించారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా దౌత్యవేత్తల బృందం మాస్కోకు రానున్న నేపథ్యంలో పుతిన్ ఈ ఆదేశాలు జారీ చేశారని ఆయన తెలిపారు. ఈ మూడు రోజుల వ్యవధిలో రాజధాని కీవ్‌తో సహా ఉక్రెయిన్‌లోని ఏ నగరంపైనా దాడులు ఉండవని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఒక రోజు ముందే ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్స్కీ ఒక కీలక ప్రతిపాదన చేశారు. శాంతి చర్చల సమయంలో ఇరుపక్షాలూ వైమానిక దాడులను నిలిపివేయాలని ఆయన కోరారు. తాము దాడులు చేయబోమని, రష్యా నుంచి కూడా అదే ఆశిస్తున్నామని పేర్కొన్నారు. యుద్ధాన్ని ముగించడానికి వాస్తవిక మార్గాలను అన్వేషిస్తున్నామని, అమెరికా దౌత్యవేత్తలు ఎలాంటి ప్రతిపాదనలు తీసుకువస్తారో చూడాలని ఆయన వ్యాఖ్యానించారు. జెలెన్స్కీ చేసిన ఈ ప్రతిపాదనకు స్పందనగానే రష్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో ఉక్రెయిన్‌లోని పలు నగరాలపై రష్యా భీకర దాడులు జరిపిన నేపథ్యంలో, ఈ తాత్కాలిక విరామం శాంతి చర్చలకు మార్గం సుగమం చేస్తుందని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

### విద్యార్థుల తీరుపై చంద్రబాబు ఆవేదన..
## వివేకంతో వ్యవహరించాలంటూ టీచర్లకు సూచన




అమరావతి: గతంలో దండనతో అయినా విద్యార్థులకు పాఠాలు నేర్పించే వీలుండేదని, కానీ నేటి సున్నితమైన పరిస్థితుల్లో కనీసం వారిని మందలించినా ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడంలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో విద్యాబోధన అత్యంత సవాళ్లతో కూడుకున్న అంశంగా మారిపోయిందని ఆయన అన్నారు. ఇలాంటి సున్నితమైన వాతావరణంలో ఉపాధ్యాయులు ఎంతో వివేకంతో ఆలోచించి వ్యవహారాలను చక్కబెట్టాలని పిలుపునిచ్చారు. విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం, మారుతున్న సామాజిక పరిస్థితులు, విద్యార్థుల ప్రవర్తనపై కీలక వ్యాఖ్యలు చేశారు. సామాజిక మాధ్యమాల ప్రభావంతో విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలవుతున్నారని, మానసిక బలహీనతతో తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారని చంద్రబాబు అన్నారు. ఇటీవలి కాలంలో తెలుగు రాష్ట్రాల్లో జరిగిన కొన్ని ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులు ప్రిన్సిపల్‌ను హత్య చేయడం, విజయనగరంలో ఓ బాలుడు కన్నతల్లినే చంపడం, విశాఖలో టీచర్ కొట్టిన దెబ్బకు ఆరేళ్ల చిన్నారి షాక్‌తో ప్రాణాలు విడవడం వంటి ఘటనలు తనను కలచివేశాయని తెలిపారు. గతంలో ఇలాంటి సంఘటనలు ఎప్పుడూ చూడలేదని, ఈ పరిస్థితులను అధిగమించేందుకు విద్యార్థులకు యోగా, ధ్యానం, ఆధ్యాత్మిక చింతన వంటివి అలవాటు చేయాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతికత ఎంతగా అభివృద్ధి చెందినా ఉపాధ్యాయుల స్థానాన్ని ఏదీ భర్తీ చేయలేదని చంద్రబాబు స్పష్టం చేశారు. టీచర్ వద్ద లేని సమాధానం ఏఐ కూడా చెప్పలేదని అన్నారు. విద్యార్థులను భవిష్యత్ ప్రపంచానికి సిద్ధం చేసే బాధ్యత ఉపాధ్యాయులదేనని, వారిని కేవలం పాఠాలకే పరిమితం చేయకుండా విలువలు, సంస్కృతి, దేశభక్తి, ప్రకృతి పట్ల ప్రేమను పెంపొందించాలని కోరారు. ప్రతి పాఠశాలకు ఒక ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్ తీసుకురావాలని, దేశానికే "ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్" ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. 2027 నాటికి రాష్ట్రంలో 100 శాతం అక్షరాస్యత సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం పునరుద్ఘాటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి సంతకం మెగా డీఎస్సీపైనే చేసిందని, వైసీపీ నేతలు 350కి పైగా పిటిషన్లు వేసి అడ్డుకోవాలని చూసినా వాటన్నింటినీ అధిగమించి నియామకాలు చేపట్టామని గుర్తుచేశారు. ఉపాధ్యాయులకు గౌరవం ఇస్తూ, వారి ప్రతిభకే పెద్దపీట వేసేలా పారదర్శక కౌన్సెలింగ్ విధానాన్ని చట్టబద్ధం చేశామని వివరించారు. గత ప్రభుత్వంలా కాకుండా, తాము ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు సముచిత గౌరవం ఇస్తామని, వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని భరోసా ఇచ్చారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలో అగ్రగామిగా నిలిస్తే, అందులో ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్‌గా ఉండాలని, ఆ లక్ష్యానికి పునాదులు వేయాల్సింది ఉపాధ్యాయులేనని చంద్రబాబు పిలుపునిచ్చారు.

### గత పాలకుల నిర్వాకం వల్ల పెళ్లిళ్లను
## కూడా వాయిదా వేసుకున్నాం: ఏపీ ఉద్యోగులు

అమరావతి: గత ప్రభుత్వ హయాంలో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడ్డామని, కనీసం పీఎఫ్ లోన్లు కూడా మంజూరు చేయకుండా వేధించడంతో పిల్లల పెళ్లిళ్లు వాయిదా వేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ముఖ్యమంత్రి చంద్రబాబు తమ సమస్యల పరిష్కారంపై సానుకూలంగా స్పందించి, కీలక హామీలకు ఆమోదం తెలపడంతో వారిలో హర్షం వ్యక్తమవుతోంది. శనివారం సీఎం క్యాంప్ కార్యాలయంలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ సంఘాల నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ భేటీలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలపై చర్చించారు. సుదీర్ఘకాలంగా పెండింగులో ఉన్న 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) ఏర్పాటుకు సీఎం ఆమోదం తెలిపారు. దీంతో పాటు, బకాయిపడ్డ నాలుగు డీఏలలో రెండింటిని వెంటనే విడుదల చేసేందుకు అంగీకరించారు. మరికొన్ని ముఖ్యమైన పెండింగ్ అంశాల పరిష్కారానికి కూడా ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ నిర్ణయాలపై ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యల పట్ల ప్రభుత్వం చూపిన సానుకూలతకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం రిటైర్మెంట్ ఉద్యోగులకు మేలు చేసే అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను రద్దు చేసిందని, దానిని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించడంపై ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో (పీఎస్‌యూ) పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును పెంచే నిర్ణయాన్ని కూడా స్వాగతించారు. రాష్ట్రం ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తాము అర్థం చేసుకోగలమని ఉద్యోగ సంఘాల నేతలు అన్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్రాభివృద్ధికి, ప్రభుత్వానికి తమ సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని వారు ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, ఆర్థిక శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


### కొండా సురేఖ రాఖీ కట్టడంపై
## సీఎం రేవంత్ రెడ్డి ఏమన్నారంటే...!

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తూ, మాజీ మంత్రి కొండా సురేఖతో రాఖీ కట్టించుకోవడంపై స్పందించారు. తనకు సంస్కారం ఉందని, అందుకే ఆమెను గౌరవించి రాఖీ కట్టించుకున్నానని తెలిపారు. కానీ, కేటీఆర్ మాత్రం సొంత చెల్లితో రాఖీ కట్టించుకోకుండా అమెరికాకు పారిపోయారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ విమర్శలను తనదైన శైలిలో తిప్పికొట్టారు. కేటీఆర్‌ను దుర్మార్గుడిగా అభివర్ణిస్తూ, లక్షల కోట్లు దోచుకుని, ఆస్తిలో వాటా అడుగుతుందనే భయంతోనే సొంత చెల్లిని ఇంటి నుంచి వెళ్లగొట్టారని తీవ్ర ఆరోపణలు చేశారు. సొంత చెల్లికే అన్నం పెట్టని వారు సామాన్య ప్రజలకు ఏం సేవ చేస్తారని ఆయన నిలదీశారు. కేవలం ఇంగ్లీష్ మాట్లాడినంత మాత్రాన కేటీఆర్ మేధావి కాలేరని, దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి ఎవరి చదువు ఎంతో తేల్చుకుందామని సవాల్ విసిరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పైనా రేవంత్ విమర్శలు గుప్పించారు. కేటీఆర్ భయంతోనే కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని, ప్రతిపక్ష నేతగా ఎన్నికైనప్పటికీ ఇప్పటివరకు అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాలేదని ఎద్దేవా చేశారు.

### అండమాన్ దీవులకు కొత్త సారథి..
## లెఫ్టినెంట్ గవర్నర్‌గా బీజేపీ నేత దినేశ్ శర్మ

ఢిల్లీ: ఉత్తరప్రదేశ్ మాజీ ఉప ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత డాక్టర్ దినేశ్ శర్మకు కీలక పదవి లభించింది. ఆయనను అండమాన్ నికోబార్ దీవుల లెఫ్టినెంట్ గవర్నర్‌గా (ఎల్జీ) రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నియమించారు. ఈ మేరకు సెప్టెంబర్ 5న ( శనివారం) రాత్రి రాష్ట్రపతి భవన్ ఓ ప్రకటన విడుదల చేసింది. ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఈ నియామకం అమల్లోకి వస్తుందని పేర్కొంది. ప్రస్తుత లెఫ్టినెంట్ గవర్నర్ అడ్మిరల్ (రిటైర్డ్) దేవేంద్ర కుమార్ జోషి (డీకే జోషి) స్థానంలో దినేశ్ శర్మ బాధ్యతలు చేపట్టనున్నారు. 2017 అక్టోబర్ నుంచి దాదాపు తొమ్మిదేళ్లుగా డీకే జోషి ఈ పదవిలో కొనసాగుతున్నారు. 62 ఏళ్ల దినేశ్ శర్మ ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా, రాజ్యసభ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయన రాజ్యసభ పదవీకాలం 2026 నవంబర్ 25న ముగియనుంది. గతంలో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంలో 2017 మార్చి నుంచి 2022 మార్చి వరకు దినేశ్ శర్మ ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. అంతకుముందు పదేళ్లపాటు లక్నో మేయర్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. వృత్తిరీత్యా కామర్స్ ప్రొఫెసర్ అయిన ఆయన, లక్నో యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఈ నియామకంపై దినేశ్ శర్మ 'ఎక్స్'వేదికగా స్పందిస్తూ రాష్ట్రపతి, ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇది రాజ్యాంగం, దేశం, ప్రజా సేవ పట్ల గొప్ప బాధ్యత అని, పూర్తి నిబద్ధత, అంకితభావంతో విధులను నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. కేంద్రపాలిత ప్రాంతమైన అండమాన్ నికోబార్ దీవులకు లెఫ్టినెంట్ గవర్నర్, రాష్ట్రపతికి ప్రతినిధిగా వ్యవహరిస్తారు.

## ఎర్రవల్లిలో కీలక భేటీ.. గులాబీ దళానికి కేసీఆర్ దిశానిర్దేశం!



గజ్వేల్: అసెంబ్లీ సమరం మొదలుకాక ముందే బీఆర్ఎస్ బరిలోకి దిగింది.. కాంగ్రెస్ సర్కార్‌ను టార్గెట్ చేసేందుకు అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటోంది. ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం వేదికగా బీఆర్ఎస్ కీలక సమావేశం జరగనుంది. గులాబీ నేత కేసీఆర్ అధ్యక్షతన జరిగే శాసనసభా పక్ష భేటీలో.. సెప్టెంబర్ 7 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేయనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అసెంబ్లీ వేదికగా ఇరుకున పెట్టేందుకు 'అస్త్రాలు' సిద్ధం చేసుకుంటున్న బీఆర్ఎస్.. రైతులు, యువత, విద్యార్థులు, మహిళల సమస్యలతో పాటు 22-ఏ భూములు, ప్రభుత్వ హామీలు, పెండింగ్ పథకాలను ప్రధాన అజెండాగా మార్చే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనపై చర్చించడంతో పాటు, బీఆర్ఎస్ ఇప్పటికే విడుదల చేసిన ఛార్జ్‌షీట్‌పై సభ్యులకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం. కేసీఆర్ స్వయంగా అసెంబ్లీకి హాజరుకాకపోయినా.. ఫామ్‌హౌస్ నుంచే పార్టీ ఎమ్మెల్యేలకు వ్యూహాన్ని తెలపనున్నారు. సభలో కాంగ్రెస్‌ను నిలదీయాల్సిన అంశాలు.. ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే వ్యూహాలపై కేసీఆర్ కీలక సూచనలు చేయనున్న నేపథ్యంలో.. అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ దూకుడు ఎలా ఉండబోతుందన్నది ఆసక్తికరంగా మారింది.

## మంత్రివర్గంలోకి మహేశ్ గౌడ్.. కొత్త పీసీసీ చీఫ్ ఎవరు?

హైదరాబాద్: తెలంగాణలో మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధమవుతోంది. ఈ నెలాఖరులోగా కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరించి, ఖాళీగా ఉన్న మూడు బెర్తులను భర్తీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ విస్తరణలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. మహేశ్ గౌడ్ రెండేళ్ల పీసీసీ అధ్యక్ష పదవీకాలం ఈ నెల 15తో ముగియనుండటంతో, ఆయనను కేబినెట్‌లోకి తీసుకుని పార్టీకి కొత్త అధ్యక్షుడిని నియమించాలని అధిష్ఠానం యోచిస్తోంది. కొత్త పీసీసీ చీఫ్ రేసులో మంత్రి పొన్నం ప్రభాకర్, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మరోవైపు, మంత్రి పదవుల కోసం పలువురు సీనియర్ నేతలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశాలున్నాయని చర్చ నడుస్తోంది. సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ విజయశాంతి, మహిళా కోటాలో నలమాద పద్మావతీ రెడ్డి కూడా మంత్రి పదవిని ఆశిస్తున్నారు. ఎన్నికల హామీ మేరకు తనకు మంత్రి పదవి ఇవ్వాలని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బహిరంగంగానే కోరుతున్నారు. అయితే ఆయన సోదరుడు వెంకటరెడ్డి ఇప్పటికే మంత్రిగా ఉండటంతో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న ఆసక్తి నెలకొంది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కాంగ్రెస్ అధిష్ఠానం తుది విడత చర్చలు జరపనుంది. ఆయన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది జాబితాను ఖరారు చేయనుంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మహేశ్ గౌడ్‌లను కూడా ఢిల్లీకి పిలిపించి మాట్లాడనున్నట్లు తెలుస్తోంది.

## ప్రశాంత జీవన సూత్రం

సముద్ర తీరాన నిలబడినప్పుడు ఒక్కొక్కరి స్పందన ఒక్కోలా ఉంటుంది. ఒకరు అలల హోరును చూసి భయపడితే, మరొకరు పాదా లను తడిపే అలల స్పర్శతో పరవశిస్తారు, ఇంకొకరు నీటిపై తేలే రంగురాళ్లను ఏరుకుంటారు. కొందరు విలువైన రత్నాల కోసం లోతుకు వెళ్తారు. తీరాన స్థిరంగా నిలబడి, దేనితోనూ అంటుకోకుండా సముద్ర గమనాన్ని గమనించేవాడే నిజమైన 'ద్రష్ట'. మన ఆలోచనల నుండి మనం విడివడి, వాటిని కేవలం ఒక సాక్షిగా గమనించినప్పుడు, ఆ ఉద్వేగాల తీవ్రత క్రమంగా క్షణించి మనసు ప్రశాంత నిర్మల సాగరమవుతుంది. నదిలో కొట్టుకుపోయేవాడు ప్రవాహ వేగాన్ని కొలవలేడు, తీరాన నిలబడేవాడే దాని లోతును గ్రహించగలడు. జీవితంలో సంభవించే పరిణామాలు కూడా అలల వంటివేబీ అవి మనల్ని తాకవచ్చు గానీ ముంచేయకూడదు. ఈ నిరంతర జాగరూకతే మనల్ని నిలబెడుతుంది. నిశ్చలత్వమే నిత్య సత్యమని గ్రహించినప్పుడే మానవుడు పరిపూర్ణుడు కాగలడు. విశ్వజనీన ధర్మం కేవలం పూజాది క్రతువుల సముచ్చయం కాదుబీ అది అనంతమైన చైతన్య రహస్యాల నిధి. ముండకోపనిషత్తు ఉద్ఘాటించిన 'ద్వా సుపర్ణా సయుజా సఖాయా...' అనే దివ్య మంత్రం మానవ మనస్తత్వానికి ఒక అద్భుత భాష్యం. ఒకే వృక్షంపై నివసించే రెండు పక్షులలో ఒకటి భౌతిక ఫలాలను భుజిస్తూ సుఖదుఃఖాలకు లోనవుతుంటే, రెండవది కేవలం 'సాక్ష'గా వీక్షస్తూ ఆనందమయంగా ఉంటుంది. లోకంలోని ద్వంద్వాలను అనుభవించేది ఒక పక్ష అయితే, ఆ అనుభవాన్ని నిర్లిప్తతతో గమనించేది మరో పక్ష. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో, ఒత్తిడి కోరల్లో చిక్కుకున్న ఆధునిక మానవుడికి ఈ సాక్షభావమే అత్యంత ఆవశ్యకమైన సంజీవని. ఆ దివ్య దృష్టిలోనే జగత్తు అసలైన పరమార్థం నిబిడీకృతమై ఉంది. ఈ నిరంతర ఎరుక కలిగిననాడు మనిషి సామాన్య జీవి నుండి దైవత్వపు అంచులకు చేరుకుంటాడు. జ్ఞానాగ్నితో అజ్ఞానాన్ని దహించి, ఆత్మజ్ఞాన సౌరభాన్ని పొందడమే ఆర్ష సంస్కృతి మనకు బోధించే పరమ రహస్యం. మానవ జన్మ ధన్యమవ్వడానికి ఇటువంటి తాత్విక చింతన ఎంతో అవసరం. భగవద్గీతలో కృష్ణ పరమాత్మ బోధించిన 'అసంగత్వమే' ఈ సాక్షభావం. తామరాకుపై నీటిబొట్టులా సంసారంలో ఉంటూనే, దేనికీ అంటకుండా ఉండటం ఒక దివ్య కళ. 'నేను కోపంగా ఉన్నాను' అని కాకుండా, 'నా మనసులో కోపం అనే తరంగం ఉద్భవించింది' అని గమనించడం ప్రారంభించిన క్షణమే ఆ వికారం ఆవిరైపోతుంది. ఇది పలాయనవాదం కాదుబీ పరిపూర్ణమైన అవగాహనతో కూడిన ప్రశాంత స్థితి. సుఖం వచ్చినప్పుడు అది ఒక అతిథి అని, దుఃఖం సంభవించినప్పుడు అది ఒక తాత్కాలిక మేఘమని భావించాలి. వైదిక విజ్ఞానం మనకు అందించిన ఈ అమోఘమైన దృక్పథం, వ్యక్తిని సమర్థుడిగా, సమాజాన్ని సలక్షణంగా తీర్చిదిద్దుతుంది. ఎక్కడైతే ద్వేషం ఉండదో, ఎక్కడైతే మమకారపు సంకెళ్లు ఉండవో, అక్కడ నిరతిశయమైన శాంతి విరాజిల్లుతుంది. సాక్షభావంతో జీవించడం నేర్చుకుంటే, ప్రతి రోజూ ఒక ఉత్సవమే, ప్రతి క్షణం ఒక పరమపదమే. చీకటిని నిందించడం కంటే చిన్న దీపాన్ని వెలిగించడం మేలు అన్నట్లు, కల్లోల ప్రపంచంలో మనశ్శాంతి అనే జ్యోతిని వెలిగించుకుందాం. సర్వం ఆ పరమాత్మ స్వరూపం! లోకాః సమస్తాః సుఖినో భవంతు! మేఘాలు వస్తుంటాయి, పోతుంటాయిబీ ఆకాశం మాత్రం ఎప్పుడూ నిర్మలంగానే ఉంటుంది. మన ఆత్మ ఆ ఆకాశం వంటి నిర్లిప్త స్థితి. ఇటువంటి మానసిక సంస్కారం అలవడినప్పుడు మనిషి ఏ పరిస్థితిలోనూ చెక్కుచెదరని ధైర్యంతో, ప్రశాంతతతో వ్యవహరించగలడు. అంతిమంగా, మన జీవిత నాటకంలో మనం కేవలం పాత్రధారులమే కాదు, ఆ నాటకాన్ని తిలకించే ప్రేక్షకులం కూడా అని గుర్తించడమే పరమ సత్యం. ఈ జ్ఞానమే మనల్ని బంధవిముక్తులను చేసి మోక్షమార్గాన నడిపిస్తుంది. నిష్కామ కర్మ ద్వారానే సిద్ధి కలుగుతుందని పెద్దల మాట.

### ఉసేన్ బోల్ట్ కంటే వేగంగా..
## 2 మీటర్లు ఎగిరిన చైనా రోబో!

కొత్త 'సూపర్‌మ్యాన్' హ్యూమనాయిడ్ రోబోను ఆవిష్కరించిన యూనిట్రీ

రోబో నిల్చున్న చోటు నుంచి 2 మీటర్లు ఎగరగలదన్న కంపెనీ

చూస్తుంటే మనిషేనా అనిపిస్తుంది.. కదలికలు చూస్తే మాత్రం రోబో! చైనాకు చెందిన యూనిట్రీ రోబోటిక్స్ సరికొత్త హ్యూమనాయిడ్ రోబోను ఆవిష్కరించింది. దీనికి 'సూపర్‌మ్యాన్' అని ముద్దుపేరు పెట్టారు. ఈ రోబో నిల్చున్న చోటు నుంచే ఏకంగా 2 మీటర్ల ఎత్తు ఎగరగలదని కంపెనీ చెబుతోంది. అంతేకాదు.. గంటకు 45.6 కిలోమీటర్ల వేగంతో పరుగెత్తగలదని వెల్లడించింది. కంపెనీ విడుదల చేసిన వీడియోలో రోబో ఒక్కసారిగా పైకి ఎగిరి సుమారు 2 మీటర్ల ఎత్తుకు చేరింది. ఆ తర్వాత అదుపు తప్పకుండా రెండు కాళ్లపై సురక్షితంగా దిగింది. కేవలం మూడు నెలల సమయంలోనే ఈ రోబోను అభివృద్ధి చేసినట్లు యూనిట్రీ తెలిపింది. భవిష్యత్తులో దీని సామర్థ్యాన్ని మరింత పెంచే అవకాశం ఉందని పేర్కొంది. ఈ రోబో గరిష్ఠ వేగం సెకనుకు 12.66 మీటర్లు. అంటే గంటకు సుమారు 45.6 కిలోమీటర్లు. 2009లో 100 మీటర్ల ప్రపంచ రికార్డు పరుగులో ఉసేన్ బోల్ట్ నమోదు చేసిన అత్యధిక వేగం సెకనుకు 12.42 మీటర్లు. ఈ లెక్కన రోబో వేగం బోల్ట్ గరిష్ఠ వేగాన్ని మించిందని కంపెనీ చెబుతోంది. మనిషి నిల్చున్న చోటు నుంచి ఎగిరిన అత్యధిక ఎత్తు సుమారు 1.8 మీటర్లుగా ఉంది. 'సూపర్‌మ్యాన్' రోబో దాన్ని కూడా అధిగమించినట్లు యూనిట్రీ పేర్కొంది. మరో విశేషం.. ఇంతటి పనితీరు చూపిస్తున్న రోబో కాళ్ల పొడవు కేవలం 0.85 మీటర్లు. అయితే ఈ గణాంకాలన్నీ యూనిట్రీ నిర్వహించిన డెమో ఆధారంగా వెల్లడించినవే. వీటిని స్వతంత్రంగా ధ్రువీకరించాల్సి ఉంది. నియంత్రిత పరీక్షా పరిస్థితుల్లో కాకుండా వాస్తవ పరిస్థితుల్లోనూ ఇదే వేగాన్ని, జంప్ సామర్థ్యాన్ని కొనసాగించగలదా అన్నది స్పష్టంగా తెలియదు. యూనిట్రీ ఇప్పటికే వేగంగా కదిలే హ్యూమనాయిడ్ రోబోలతో గుర్తింపు తెచ్చుకుంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో కంపెనీకి చెందిన హెచ్1 రోబో సెకనుకు 10 మీటర్ల వేగంతో పరుగెత్తినట్లు ప్రకటించింది. తాజా ప్రదర్శనతో వేగంతో పాటు రోబోల సమతుల్యత, చురుకుదనం, ఒక్కసారిగా శక్తిని ప్రయోగించే సామర్థ్యంపైనా యూనిట్రీ దృష్టి పెడుతున్నట్లు స్పష్టమవుతోంది.

## “పెంపుడు జంతువుల కోసం ఖర్చు చేసే డబ్బు కంటే తక్కువ”



న్యూఢిల్లీ: ఆశ్రమ పాఠశాలల్లో మృతి చెందిన ఆదివాసీ విద్యార్థుల కుటుంబాలకు మహారాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పరిహారంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మండిపడ్డారు. ఆ పరహారం కొంతమంది రాజకీయ నాయకులు ఏడాదిలో తమ పెంపుడు జంతువుల కోసం ఖర్చు చేసే డబ??బు కంటే కూడా తక్కువగా ఉందని చెప్పారు. ఎక్స్‌లో దీప్కే స్పందిస్తూ.. 590 మందికి పైగా ఆదివాసీ విద్యార్థుల కుటుంబాలకు కేవలం రూ.2 లక్షల చొప్పున పరిహారం మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు. “కేవలం 2 సంవత్సరాల్లో మహారాష్ట్రలోని ఆశ్రమ పాఠశాలల్లో 590 మందికి పైగా ఆదివాసీ విద్యార్థులు మృతి చెందారు. వారి కుటుంబాలకు కేవలం రూ.2 లక్షల చొప్పున పరిహారం మాత్రమే అందింది” అని దీప్కే పేర్కొన్నారు. విద్యార్థులకు భద్రతను ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని, నిర్లక్ష్యం కారణంగానే వారు మృతి చెందారని దీప్కే ఆరోపించారు. “వారి భద్రత, సంక్షేమాన్ని ప్రభుత్వం నిర్ధారించడంలో విఫలమైంది. నిర్లక్ష్యం, శ్రద్ధ లేకపోవడం, నిర్వహణ లోపం కారణంగా విద్యార్థులు మృతి చెందినప్పుడు వారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున అందజేస్తున్నారు. కొంతమంది రాజకీయ నాయకులు ఏడాదిలో తమ పెంపుడు జంతువుల కోసం ఖర్చు చేసే మొత్తం కంటే ఇది తక్కువే కావచ్చు. రాష్ట్రం దృష్టిలో ఆదివాసీ విద్యార్థి జీవితం విలువ ఇంతేనా?” అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో షెడ్యూల్డ్ ట్రైబ్ అభ్యర్థులను నియమించాలని, గిరిజన పిల్లల కోసం నిర్వహిస్తున్న వసతి పాఠశాలల పరిస్థితులను మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ గిరిజన విద్యార్థులు నిరసనలు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దీప్కే ఈ వ్యాఖ్యలు చేశారు. గడ్చిరోలి జిల్లాలోని ఒక వసతి పాఠశాలలో పాముకాటుకు గురై ముగ్గురు గిరిజన బాలికలు మృతి చెందిన ఘటన తర్వాత పుణె, నాగ్‌పూర్, నాసిక్‌లలో నిరసనలు ప్రారంభమయ్యాయి. గిరిజన వసతి గృహాల్లో ఉంటూ, గిరిజన వసతి పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి రూ.10 కోట్ల బీమా కవరేజీ కల్పించాలని కూడా నిరసనకారులు డిమాండ్ చేశారు.

## తీవ్ర విషాదం.. కల్తీ మద్యం సేవించి 10 మంది మృతి



భోపాల్: మధ్యప్రదేశ్‌లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. సాగర్ జిల్లాలో కల్తీ మద్యం సేవించి పదిమంది ానతంలయతృువ .నరాదరెచతృిువఅక్కడి ఘూఘర్, నౌరాజ్, బరాజ్ తదితర గ్రామాలకు చెందినవారిగా అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అయితే నిన్న శనివారం మద్యం సేవించిన అనంతరం బాధితుల ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు వారిని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే పరిస్థితి విషమించడంతో వారు ్లుటదిరెచతృిువవైద్యులు ప్రకటించారు. మరి కొంతమందికి చికిత్స అందిస్తున్నారు. అయితే ఈ మరణాలకు కల్తీ మద్యమే కారణమై ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నప్పటికీ, పోస్టుమార్టం నివేదికలు వచ్చే వరకు అధికారికంగా కారణాన్ని నిర్ధారించలేదు. ృత్యువల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

### యూపీ నుంచి కల్తీ మద్యం సరఫరా?

ఈ ఘటనపై ప్రాథమిక దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. సాగర్‌కు సరిహద్దుగా ఉన్న ఉత్తరప్రదేశ్‌లోని లలిత్‌పూర్ కేంద్రంగా ఓ అక్రమ మద్యం సరఫరా నెట్‌వర్క్ ఎ నిచేస్తున్నట్లుపోలీసులు అనుమానిస్తున్నారు.నిందితులు లలిత్‌పూర్‌లో నకిలీ మద్యాన్ని తయారు చేసి, సాగర్ సరిహద్దు గ్రామాలకు తరలించినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. నకిలీ మద్యాన్ని అసలైన బ్రాండ్ల మాదిరిగా కనిపించేలా నకిలీ లేబుళ్లు, క్యాప్‌లు, క్యూఆర్ కోడ్‌లు ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. కార్లు, మోటార్‌సైకిళ్ల ద్వారా ఈ మద్యాన్ని వివిధ ప్రాంతాలకు తరలించినట్లుఅనుమానిస్తున్నారు.బాంద్రీ, బరోడియా, ఘూఘూరా ఖుర్ద్, నౌరాజ్, బరాజ్ తదితర గ్రామాలకు ఈ నకిలీ మద్యం చేరినట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. మద్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరెవరు సరఫరా చేశారు? స్థానికంగా ఎవరైనా ఈ అక్రమ నెట్‌వర్క్‌కు సహకరించారా? అనే కోణాల్లో పోలీసులువిచారణ చేస్తున్నారు.

### ఘటనపై సీఎం సీరియస్

సాగర్‌లో జరిగిన మరణాలపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. ఘటనాస్థలికి సంబంధిత మంత్రి, ఉన్నతాధికారులు వెళ్లి పరిస్థితిని పరిశీలించాలని ఆదేశించారు. పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

## ఏపీకి బిగ్ అలర్ట్.. రాగల మూడు గంటల్లో..



విజయవాడ: రాగల మూడు గంటల్లో వర్షాలు కురిసే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. నూజివీడు, ఆగిరిపల్లి, గన్నవరం, ఏలూరు, మైలవరం, నున్న, విజయవాడ పరిసర ప్రాంతాల్లో పలు చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. కాగా, దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. దీంతో దేశంలోని పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. పలు రాష్ట్రాలకు ఎల్లో, ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన ఐఎండీ.. ఢిల్లీతో పాటు హర్యానా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, పంజాబ్, మధ్యప్రదేశ్‌లలో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, బీహార్, నాగాలాండ్, మణిపూర్, మిజోరంలో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది.


## ‘అక్రమాలపై ప్రశ్నిస్తే చంద్రబాబుకు ఎందుకంత భయం?’




తాడేపల్లి: అక్రమాలను ప్రశ్నిస్తుంటే చంద్రబాబు సర్కార్‌కు భయం పట్టుకుందని.. అందుకే ప్రశ్నించే గొంతులను నులుముతున్నారంటూ వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్ మండిపడ్డారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో అనధికార సెన్సార్ షిప్ దుర్మార్గం అన్నారు. సోషల్ మీడియా ఖాతాలను లేపేస్తున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లను తొలగించారు. సాక్షి టీవీ, బిగ్ టీవీ ఖాతాలను కూడా లేపేశారు. ప్రశ్నించే గొంతులను చూసి చంద్రబాబుకు ఎందుకంత భయం?” అంటూ శివశంకర్ ప్రశ్నించారు. డీఎస్సీ అక్రమాలపై ప్రశ్నిస్తే నేరమా?. అందులో అబద్ధాలు ఉంటే ప్రభుత్వం సమాధానం చెప్పాలి. కానీ సోషల్ మీడియా, టీవీ ఛానళ్ల ఎక్కౌంట్లపై దాడి ఎందుకు?. తప్పులను కప్పి పుచ్చుకోవటానికే సోషల్ మీడియా ఖాతాలపై దాడి చేస్తున్నారు. ఇదే కొనసాగితే సోషల్ మీడియా వార్ తప్పదు. డీఎస్సీలో అక్రమాలకు మంత్రి లోకేష్ బాధ్యత వహించాలి. పదవికి రాజీనామా చేసి సీబీఐతో విచారణ జరపాలి. సోషల్ మీడియా అకౌంట్లపై దాడిని తీవ్రంగా పరిగణిస్తున్నాం. న్యాయ పోరాటం చేసి మళ్ళీ ఆ అక్కౌంట్లను సాధిస్తాం” అని శివశంకర్ అన్నారు.

# ప్రపంచం మారిపోయింది!

### సరికొత్త ఈక్వల్ ఎర్త్ మ్యాప్ సిద్ధం
### ఐక్యరాజ్యసమితి ఆమోదం
### అమెరికా వ్యతిరేకం, భారత్ మద్దతు




అవును. మీరు చదివింది అక్షరాలా నిజం. ఎప్పుడో జీపీఎస్, లైడార్ వంటి టెక్నాలజీలేవీ లేని కాలంలో ఫ్రెంచ్ కార్టోగ్రాఫర్ మెర్కాటర్ తయారు చేసిన మ్యాప్ స్థానంలో ఐక్యరాజ్యసమితి సరికొత్త ప్రపంచ పటాన్ని అధికారికంగా ఆమోదించింది. పాత మ్యాప్‌లో ఆఫ్రికా, లాటిన్ అమెరికా, దక్షిణాసియాలు వాటి వాస్తవ సైజు కంటే తక్కువగా కనిపిస్తున్నాయని, దాన్ని సరిచేస్తూ ‘ఈక్వల్ ఎర్త్’పేరుతో కొత్త మ్యాప్ తయారు చేశామని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. భారత్ సహా మొత్తం 164 దేశాలు ఈ ప్రతిపాదనకు మద్దతు తెలపగా అగ్రరాజ్యం అమెరికా వ్యతిరేకించింది. ఆరు దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయాయి. విద్య, మీడియా, అంతర్జాతీయ విధానాల్లో దేశాలకు తగిన ప్రాధా న్యం లభించాలన్నది ఈ మార్పు ఉద్దేశం. ఒకసారి ప్రపంచపటాన్ని చూడండి. ఎగువభాగంలో గ్రీన్‌ల్యాండ్.. దిగువన ఆఫ్రికా ఖండం కనిపిస్తాయి. రెండింటిలో ఏది పెద్దదంటే మీరేమంటారు? సహజంగానే గ్రీన్‌ల్యాండ్ అని సమాధానం వస్తుంది. కానీ.. దీంతోపోలిస్తే ఆఫ్రికా ఒకటి కాదు..రెండు కాదు.. 14 రెట్లు ఎక్కువ సైజుంటుంది. మెర్కాటర్ అనే మ్యాపుల తయారీదారు 1569లో సిద్ధం చేసిన మ్యాప్‌నే మనం ఇప్పటికీ వాడుతూండటం దీనికి కారణం. ఇదొక్కటే కాదు.. ఇలాంటి తేడాలు ఇంకా చాలానే ఉన్నాయి దీంట్లో. ప్రపంచాన్ని కాగితంపై చూపించడానికి చేసుకున్న ఎన్నో రాజీల్లో మెర్కాటర్ మ్యాప్ ఒకటి. భూమి గుండ్రంగా త్రీడీలో ఉంటే.. కాగితం 2డీలో ఉండటం అసలు సమస్యకు కారణం. దీన్ని సరిచేసేందుకు మ్యాప్ ప్రొజెక్షన్ పద్ధతిని ఉపయోగించారు. ఫలితంగా ప్రపంచ ప్రఖ్యాత మెర్కాటర్ ప్రొజెక్షన్‌లో తేడాలు వచ్చేశాయి. భూమధ్య రేఖకు దూరంగా జరుగుతున్న కొద్దీ మ్యాప్‌లోని భూభాగాల పరిమాణం పెరిగిపోతూ ఉంటుంది. అయితే అప్పట్లో మెర్కాటర్ ఈ మ్యాపును కేవలం సముద్రయానం కోసం మాత్రమే తయారు చేశాడు. అందుకే ఆఫ్రికా విస్తీర్ణం 303.7 కోట్ల చదరపు కిలోమీటర్లయినా.. మెర్కాటర్ మ్యాప్‌లో 21.7 కోట్ల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం మాత్రమే ఉన్న గ్రీన్‌ల్యాండ్ కంటే చిన్నగా కనిపిస్తూంటుంది. అప్పట్లో సముద్రయానానికి మెర్కాటర్ మ్యాప్ బాగా పనిచేసింది కానీ.. ఈ తేడాలు అనేక ఇతర సమస్యలను తీసుకొచ్చాయి. ఈక్వల్ ఎర్త్ మ్యాప్ అవసరం ఏర్పడింది ఇందుకే. బోజన్ సావ్రిచ్, టామ్ ప్యాటర్సన్, బెర్న్‌హార్డ్ జెన్నీ అనే ముగ్గురు కార్టోగ్రాఫర్‌లు 2018లో ‘ఈక్వల్ ఎర్త్’మ్యాప్‌ను రూపొందించారు. భూభాగాల విస్తీర్ణాన్ని సరిగ్గా చూపించడం ఈ ప్రొజెక్షన్ ముఖ్య ఉద్దేశం. అంతేకాదు...లెక్కల్లో గట్టిగా ఉండటమే కాకుండా.. చూసేందుకు కూడా సహజంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. వాస్తవానికి ప్రపంచ పటం విషయంలో కొన్ని వందల ప్రొజెక్షన్స్ అందుబాటులో ఉన్నాయి. కానీ వీటిల్లో మెర్కాటర్ సహా ఓ డజను మాత్రమే ఎక్కువ ప్రాచుర్యంలో ఉన్నాయి. ఈక్వల్ ఎర్త్ ప్రొజెక్షన్‌లో భూభాగాల పరిమాణాలు వాస్తవ పరిస్థితులకు దగ్గరగా ఉండటం వల్ల ఎవరో పెద్ద... మిగిలిన వారు చిన్న అన్న భావన భావన ఏర్పడే అవకాశం ఉండదని మద్దతుదారుల అంచనా.

### ఆఫ్రికా దేశాల ఉద్యమం

ఈక్వల్ ఎర్త్ ప్రొజెక్షన్ మ్యాప్ ముఖ్యంగా ఆఫ్రికా దేశాల ఉద్యమం ఫలితంగానే సాకారమైందని చెప్పాలి. ఆఫ్రికన్ దేశం టోగో కొత్త మ్యాప్ ప్రతిపాదన చేయగా ఆఫ్రికన్ యూనియన్ మద్దతు ఇచ్చింది. ఆఫ్రికా పరిమాణాన్ని సరిగ్గా చూపడమే కాకుండా... పాత అసమానతలను సరి చేయాలన్నది ఆఫ్రికా దేశాల ఉద్దేశం. ఇందుకు తగ్గట్టుగానే ఐరాస తీర్మానం కూడా పాఠశాలల్లో, పాఠ్యపుస్తకాల్లో మీడియా, సంస్థలు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఈక్వల్ ఎర్త్ వంటి ప్రొజెక్షన్ల వినియోగాన్ని పెంచమని కోరుతోంది.

# ‘మిద్దె’కు మద్దతిస్తే..‘అర్బన్’కు ఆరోగ్యమే!

### కాంక్రీట్ నగరాలు ‘ఎడిబుల్ సిటీస్’గా మారితేనే ఆహార సుస్థిరత
### అర్బన్ అగ్రికల్చర్‌ను మున్సిపల్ ప్రణాళికల్లో చేర్చాలంటున్న నిపుణులు
### ప్రోత్సాహక విధానాల్లేవు...లోతైన అధ్యయనాలు అవసరం
### పర్యావరణ అనుకూల నగరంగా ప్రభుత్వం మార్చాలి
### తోటలు పెంచే ఇళ్లకు ఆస్తి పన్నులో రాయితీలు ఇవ్వాలి



నగరాల్లో మిద్దెతోటలు, ఇంటిపంటల సాగు పెరుగుతున్నా, అది కేవలం గృహస్తుల హాబీగానే మిగిలిపోతోంది. వాతావరణ మార్పుల నేపథ్యంలో అర్బన్ అగ్రికల్చర్‌ను మునిసిపల్ మాస్టర్ ప్లాన్లులో చేర్చాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తుయ్యే మొత్తం ఆహారంలో సుమారు 70 శాతం నగరాల్లోనే వినియోగమవుతోందని ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (యూఎన్ఈపీ) చెబుతోంది. విధానపరమైన చర్యల ద్వారా నగరాలను ‘ఎడిబుల్ సిటీ’లుగా అంటే.. పర్యావరణ అనుకూల, సుస్థిర ఆహారోత్పత్తి కేంద్రాలుగా మార్చువచ్చని నిపుణులు సూచిస్తున్నారు. భువనేశ్వర్‌లో ఇటీవల జరిగిన అధ్యయనం మిద్దె తోటలపై ఆసక్తిని తెలియజెప్తోంది. 70% మంది గృహస్తులు మిద్దె తోటలపై ఆసక్తి చూపుతున్నా, 35% మాత్రమే ప్రస్తుతం పండిస్తున్నారు. 56% ప్రభుత్వ/విద్యా సంస్థల్లో ఖాళీ స్థలాలు, 67% సంస్థల్లో అనువైన టెర్రస్‌లు ఖాళీ స్థలాలున్నాయి. అయితే, అర్బన్ అగ్రికల్చర్ ప్రోత్సాహక విధానాల్లేవు. భువనేశ్వర్ మాదిరిగా ఇక్కడ కూడా లోతైన అధ్యయనాలు చేసి తగిన విధానాలు అమల్లోకి తేవాలని నిపుణులు సూచిస్తున్నారు.

కుటుంబాలకు తాజా, పోషక ఆహారాన్ని అందించడంలో అర్బన్ అగ్రికల్చర్ కీలక పాత్ర పోషిస్తుంది. పెరటి, మిద్దె, బాల్కనీ తోటలను విస్తరించటానికి అనుకూలమైన ప్రభుత్వ విధానాల మద్దతు అవసరం. వ్యవసాయ, పట్టణాభివృద్ధి, పర్యావరణ శాఖల సమన్వయంతో ‘ఎడిబుల్ సిటీల’ను అభివృద్ధి చేసి, పర్యావరణ అనుకూల నగరాలను తీర్చిదిద్దడం అత్యవసర వ్యూహం.

### ఏం చెయ్యాలి?

అర్బన్ అగ్రికల్చర్ విస్తరణకు స్థల కొరత, నీటి కొరత పెద్ద అవరోధాలు. వీటిని అధిగమించటానికి నిపుణులు కింది ఆచరణాత్మక పరిష్కారాలను సూచిస్తున్నారు.

వాణిజ్య భవనాలు, గేటెడ్ కమ్యూనిటీలలో రూఫ్‌టాప్ లేదా వర్టికల్ గార్డెనింగ్‌కు స్థలాన్ని తప్పనిసరి చేయటం.

ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో మురుగునీటి శుద్ధి వ్యవస్థలు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలను స్థానిక మిద్దె తోటలు, ఇంటిపంటల సాగుకు అనుసంధానించటం.

తడి చెత్తతో కంపోస్టింగ్ చేసి నాణ్యమైన సేంద్రియ ఎరువులను పంపిణీ చేయటం.

తోటలు పెంచే ఇళ్లకు ఆస్తి పన్నులో 5--10% రాయితీ, బిందు సేద్యం కిట్లపై సబ్సిడీలు అందించటం.

ప్రజా స్థలాలు, భవనాల్లో ఆహారోత్పత్తిని పట్టణ ప్రణాళికలో భాగం చేసి స్థానిక మార్కెట్లతో అనుసంధానించటం.

### ‘ఎడిబుల్ సిటీ’లకు విధానాల మద్దతు

వాతావరణ మార్పుల నేపథ్యంలో పట్టణాలు, నగరాల్లో

### నగర ప్రణాళికలో భాగం చేయాలి

వాతావరణ మార్పులు, వేగవంతమైన పట్టణీకరణ వల్ల ఆహార పంపిణీ వ్యవస్థలపై ఒత్తిడి పెరుగుతున్నందున మిద్దె తోటలు వంటి అర్బన్ అగ్రికల్చర్ పద్ధతులను నగర ప్రణాళికలో భాగం చేయాలి. ‘కోకోపోనిక్స్’వంటి మట్టిలేని ఆధునిక సాగు పద్ధతులు స్థల కొరత, నీటి కొరతను అధిగమించి స్థానిక ఆహార భద్రతను పెంచుతాయి.అందువల్ల రాష్ట్ర విధానాలు పట్టణ వ్యవసాయాన్ని, వ్యర్థాల పునర్వినియోగాన్ని ప్రోత్సహించి నగరాలను పర్యావరణ అనుకూలంగా తీర్చిదిద్దాలి.

### మిద్దెతోటల్లో ఎల్‌నినో జాగ్రత్తలు

ఎల్‌నినో వర్షాభావ పరిస్థితుల్లో మిద్దె తోటల్లో నీటిని ఆదా చేయడం ముఖ్యం. కుండీల్లో ఎండుటాకులు లేదా కొబ్బరి పొట్టుతో మల్చింగ్ చేసి, తేమ ఆవిరవకుండా చూడాలి. ఉదయం లేదా సాయంత్రం వేళల్లోనే అవసరమైనంత నీరు పోయాలి. బాల్కనీల్లో బాటిల్ డ్రిప్ వాడడం, ఎండ తీవ్రతను తగ్గించేందుకు 50% గ్రీన్ షేడ్ నెట్ ఏర్పాటు చేయటం వల్ల తక్కువ నీటితో కూరగాయలు, పండ్ల మొక్కలను రక్షించుకోవచ్చు.

# ఆట.. మీ జీన్స్‌లో ఉందా?

### డీఎన్ఏతో చాంపియన్ల తయారీ..
### 2030లో అహ్మదాబాద్‌లో జరిగే కామన్వెల్త్ క్రీడల్లో పతకాల సాధనకు గుజరాత్ కొత్త ప్రయోగం
### క్రీడాకారుల ప్రతిభను వారి జన్యు, శారీరక, ప్రతిభా సమాచారంతో గుర్తించి శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ




ఒక చిన్న డీఎన్ఏ నమూనా.. దేశంలో ఒక పెద్ద క్రీడా భవిష్యత్తుకు క్లూ కానుంది! మన క్రీడాకారులు మైదానంలో చెమట చిందించక ముందే.. వారి జన్యువులను ల్యాబ్‌లో విశ్లేషించి ఎవరు భవిష్యత్ చాంపియన్లు కాగలరో గుర్తించే ప్రయత్నం మొదలైంది! ఎవరు ఏ క్రీడలో రాణించగలరు? ఎవరి శరీరం ఏ ఆటకు అనువుగా ఉంటుంది? ఎవరిలో ఎంత శక్తి దాగుంది? అనే ప్రశ్నలకు సమాధానాలను డీఎన్ఏలో వెతికే సరికొత్త ప్రయోగానికి గుజరాత్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అహ్మదాబాద్ వేదికగా 2030లో జరగే కామన్వెల్త్ క్రీడల్లో చాంపియన్లుగా నిలిచే సత్తా ఉన్న వారెవరో వెలికితీసేందుకు దేశంలోనే తొలిసారిగా గుజరాత్ ప్రభుత్వం క్రీడా జీనోమిక్స్ కార్యక్రమాన్ని చేపట్టింది. క్రీడాకారుల జన్యు సమాచారాన్ని వారి శారీరక, క్రీడా ప్రదర్శన వివరాలతో అనుసంధానించి సమగ్ర ప్రొఫైళ్లను రూపొందించనుంది. వాటి ఆధారంగా క్రీడా ప్రతిభను గుర్తించడంతోపాటు అందుకు అనువైన క్రీడాశిక్షణను రూపొందించడం, క్రీడాకారులకు అనువైన క్రీడను ఎంపిక చేయడం, గాయాల నిర్వహణ వంటి అంశాలను మరింత మెరుగ్గా చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని గుజరాత్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆ రాష్ట్ర బయోటెక్నాలజీ రీసెర్చ్ సెంటర్ అమలు చేస్తోంది. ఇందుకోసం గుజరాత్ అథ్లెట్ జీనోమ్ డేటాబేస్‌ను రూపొందించనుంది. ఇందులో క్రీడాకారుల జన్యు, శారీరక, క్రీడా ప్రదర్శనకు సంబంధించిన సమాచారాన్ని సమీకరిస్తారు. “క్రీడా ప్రతిభను గుర్తించి, క్రీడాకారులను అభివృద్ధి చేసేందుకు మరింత శాస్త్రీయ, ఆధారిత విధానాన్ని రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం” అని గుజరాత్ శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి అర్జున్ మోఢ్వాడియా తెలిపారు.

ఈ ఏడాది 2,000 డీఎన్ఏ నమూనాలు

మొదటి దశలో టెన్నిస్ క్రీడాకారుల నుంచి డీఎన్ఏ నమూనాలను సేకరించనున్నారు. తదుపరి దశలో ఆర్చరీ, ఫెన్సింగ్, జూడో, షూటింగ్ క్రీడాకారులను చేర్చనున్నారు. ఈ ఏడాది సుమారు 2,000 నమూనాలు, వచ్చే ఏడాది 10,000 నమూనాలు సేకరించి విశ్లేషించాలని గుజరాత్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 14 ఏళ్లలోపు, 14 నుంచి 18 ఏళ్లలోపు, 18 ఏళ్లు పైబడిన క్రీడాకారుల కోసం మూడు విభాగాలతో డేటాబేస్ రూపొందించనున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి చాంపియన్లకు ఇందులో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అథ్లెటిక్స్, స్విమ్మింగ్, బాక్సింగ్, రెజ్లింగ్, జూడో, టెన్నిస్, తైక్వాండో, జిమ్నాస్టిక్స్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, హాకీ, హ్యాండ్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, కబడ్డీ, ఖోఖో, ఆర్చరీ, షూటింగ్, చెస్ తదితర క్రీడలకు సంబంధించిన సమాచారాన్ని డేటాబేస్‌లో చేర్చనున్నారు.

గాయాలు, శిక్షణపై కూడా ఉపయోగం

జన్యు లక్షణాలు కండరాల నిర్మాణం, ఓర్పు, జీవక్రియ, వ్యాయామానికి శరీరం స్పందించే తీరు, కోలుకునే వేగం, గాయాలకు గురయ్యే అవకాశాలు వంటి అంశాలతో ఏ మేరకు సంబంధం కలిగి ఉన్నాయో తెలుసుకునేందుకు స్పోర్ట్స్ జీనోమిక్స్ ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. “జన్యు, జీవసంబంధ సమాచారాన్ని సమీకరించడం ద్వారా ప్రతి క్రీడాకారుడికి మరింత సమగ్ర ప్రొఫైల్‌ను రూపొందించడమే గుజరాత్ నమూనా లక్ష్యం. తద్వారా క్రీడాకారుల ప్రతిభపై మరింత లోతైన అవగాహన లభిస్తుంది” అని సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం కార్యదర్శి బి. భారతి తెలిపారు.

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com epaper: https://epaper.mahinewsindia.com

## ఈనెల 8వ తేదీన కేంద్ర ప్రభుత్వ టెక్స్టైల్ కమిషనర్ వృందా మనోహర్ దేశాయ్, మరియు రాష్ట్రచేనేత మరియు జౌళి శాఖ, కమీషనర్, జి. రేఖ రాణి, నగిరి పట్టణంలో పలు కార్యక్రమాలలో పాల్గొంటారు

### జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 6 : ఈనెల 8వ తేదీన కేంద్ర ప్రభుత్వ టెక్స్టైల్ కమిషనర్ వృందా మనోహర్ దేశాయ్, మరియు మరియు రాష్ట్రచేనేత మరియు జౌళి శాఖ, కమీషనర్, జి. రేఖ రాణి, నగిరి పట్టణంలో పలు కార్యక్రమాలలో పాల్గొంటారు అనిజిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 08.09.2026 న ఉదయం 11:30 నుండి నగిరి పట్టణం నందుగల ఇంటిగ్రేటెడ్ టెక్స్టైల్ ఖఅస అపెరల్ సెంటర్, నగరి(ఐటీడీఏసీ) మరియు స్థానికముగా గల పవర్లుం ఉత్పత్తి కేంద్రములను మరియు డైయింగ్ కేంద్రములను సందర్శిస్తారు తదుపరి మ॥ 3.30 గం॥ నుండి ఎస్.ఎమ్.టి. పొన్నుస్వామి శంకరమ్మాళ్ కల్యాణ మంటపం, రైల్వే స్టేషన్ వద్ద, ఏకాంబరకుప్పం నందు స్థానికముగా గల పవర్ లూము యూనిట్ హోల్డర్స్, పవర్ లూము స్టాక్ హోల్డర్స్, టెక్మైల్ యూనిట్స్, మరియు పరిశ్రమకు సంబంధించిన సంఘముల వారితో, కేంద్ర ప్రభుత్వము వారు నూతనముగా ప్రవేశపెట్టిన టెక్స్టైల్స్ స్టాటిస్టికల్ రిటర్న్ సిస్టమ్ (టీఎస్ఆర్ఎస్) వ్యవస్థ నందు నమోదు చేసుకొనట గురించి, అందువలన ప్రయోజనముల గురించి, రాష్ట్ర ప్రభుత్వము ఇటీవల జిల్లా లోని 3400 మంది పవర్ లూము యూనిట్ల వారికి అమలు చేసిన 500 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకము గురించి, అంతేకాక కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వముల వారు నూతనముగా ప్రవేశపెట్ట బోవు పథకముల గురించి ఒక వర్కషాప్ ను నిర్వహించేదరు. కావున యావన్మంది పవర్ లూము యూనిట్ హోల్డర్స్, పవర్ లూము స్టాక్ హోల్డర్స్, టెక్స్టైల్ ఉనిట్స్, మరియు ఇండస్ట్రీస్ అసోసియేషన్స్ వారు ఈ సమావేశమునకు హాజరై వారియొక్క సలహాలు మరియు సూచనలు వెల్లడించి, పవర్లూమ్స్ కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగము చేసుకొనవలెనని జిల్లా కలెక్టర్ పై ప్రకటనలో తెలిపారు.

## సెప్టెంబర్ నెల 7 వ తేదీన సోమవారం చిత్తూరు కలెక్టరేట్ లోనే పీజిఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ -జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్




చిత్తూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 6: మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ నెల 7 వ తేదీన సోమవారం, చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు కలెక్టర్ కార్యాలయం నందు ఉదయం 9 .30 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పై ప్రకటనలో తెలిపారు.

## ఈ నెల 07 వ తేదీన జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ

### పిజిఆర్ఎస్ పై క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి




తిరుపతి, మహి న్యూస్, సెప్టెంబర్ 06 : ఈ నెల 7 వ తేదీన జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు అలాగే పిజిఆర్ఎస్ పై క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయాలన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 7వ తేదీన సోమవారం తిరుపతి కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## జనార్ధన్ రెడ్డి, మోక్షజ్ఞ పుట్టినరోజు వేడుకలు

### 29వ వార్డులో ఘనంగా నిర్వహించిన అభిమానులు, టీడీపీ నాయకులు



కర్నూలు, సెప్టెంబర్ 7: (మహి న్యూస్): కర్నూలు అర్బన్ 29వ వార్డులో యువ నాయకుడు జనార్దన్ రెడ్డి, నందమూరి మోక్షజ్ఞ పుట్టినరోజు వేడుకలను నేడు అభిమానులు, పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. 29వ వార్డు ఇన్‌చార్జి, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర డైరెక్టర్ ఎస్.కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 29వ వార్డు అధ్యక్షుడు కుమ్మరి రామకృష్ణ, యూనిట్ ఇన్‌చార్జి రాఘవేంద్రరావు, యూనిట్ సమన్వయకర్త సర్దార్, ఉపాధ్యక్షుడు అశ్విని రమేష్, కార్యదర్శి లింగన్న, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అలాగే రాజేష్, జయన్న, రాముడు, అక్బర్, అల్లాబకాస్, విజయ్, బాలకృష్ణ అభిమానుల సంఘం కర్నూలు బాబు, బాలకృష్ణ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు.

## అన్నప్రసాద పథకానికి రూ.1,01,116 విరాళం



శ్రీశైలం, సెప్టెంబర్ 6 (మహి న్యూస్): ప్రకాశం జిల్లా సంతమాగలూరుకు చెందిన ఆర్. కుసుమ ఆదివారం శ్రీశైల దేవస్థానం అన్నప్రసాద వితరణ పథకానికి రూ.1,01,116 విరాళంగా అందజేశారు. ఈ మేరకు దేవస్థానంలోని విరాళాల కేంద్రంలో కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావుకు విరాళ మొత్తాన్ని అందజేశారు. విరాళం స్వీకరించిన అనంతరం దాతకు తగిన రశీదుతో పాటు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు. భక్తుల సహకారంతో అన్నప్రసాద వితరణ పథకం నిరంతరం కొనసాగుతోందని దేవస్థానం అధికారులు తెలిపారు.

## శ్రీశైలంలో వైభవంగా పల్లకీ ఉత్సవం

### లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు



శ్రీశైలం, సెప్టెంబర్ 6 (మహి న్యూస్): లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి శ్రీ స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ప్రతి ఆదివారం, పౌర్ణమి, మూలా నక్షత్రం రోజుల్లో దేవస్థాన సేవగా పల్లకీ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని పఠిస్తారు. అనంతరం కార్యక్రమం ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగాలని మహాగణపతి పూజ నిర్వహిస్తారు. తదుపరి శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో వేంచేయించి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహిస్తారు. భక్తుల శ్రేయస్సు, లోకకల్యాణం కోసం ఈ పల్లకీ ఉత్సవాన్ని దేవస్థానం సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తోంది.

## అమ్మవారి అన్నదాన విభాగానికి రూ.1.16 లక్షల విరాళం



ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 6 (మహి న్యూస్): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి అన్నదాన విభాగానికి మచిలీపట్నంలోని బ్రహ్మపురానికి చెందిన టీ. తారకరామారావు రూ.1,16,000 విరాళంగా సమర్పించారు. అమ్మవారిపై భక్తిశ్రద్ధలతో ఈ విరాళాన్ని ఆలయ డిప్యూటీ కార్యనిర్వహణాధికారి కిషోర్ కుమార్, ఆలయ అర్చకుల సమక్షంలో భక్తిపూర్వకంగా అందజేశారు. అన్నదాన కార్యక్రమానికి భక్తులు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఆలయ అధికారులు తెలిపారు.

## ఇస్కాన్ పుణ్యక్షేత్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

### ఆధ్యాత్మిక విలువలు, సేవా భావం సమాజ అభివృద్ధికి అవసరం.



తాళ్లరేవు, మహి న్యూస్, సెప్టెంబర్ 6: తాళ్లరేవు మండలం గాడిమొగలోని ఇస్కాన్ పుణ్యక్షేత్రాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు



ఆత్మీయ స్వాగతం పలికి, ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఆలయంలో నిర్వహిస్తున్న వివిధ సేవా కార్యక్రమాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఇస్కాన్ ప్రతినిధులతో ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ.. ప్రజల శ్రేయస్సుతో పాటు ఆధ్యాత్మిక విలువలు, సేవా భావం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమాజంలో మానవతా విలువలను పెంపొందించడంలో ఆధ్యాత్మిక సంస్థలు చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని ఆకాంక్షించారు.

## నేరాల బారినుంచి గ్రామాన్ని కాపాడాలని గ్రామస్థుల మొర.

### సతీష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్.



తాళ్లరేవు, మహి న్యూస్, సెప్టెంబర్ 6: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ పరిధిలోని పెదబొడ్డు వెంకటాయపాలెం గ్రామాన్ని నేరాల బారినుంచి కాపాడాలని గ్రామస్థులు పోలీసులను కోరారు. గ్రామానికి చెందిన పాలెపు సతీష్, అతని తల్లిదండ్రులు పాలెపు రామారావు, అన్నవరం ప్రోత్సాహంతో పలు నేరాలకు పాల్పడుతున్నారని గ్రామస్థులు ఆరోపించారు. సీతారామపురం గుడ్డివానితూము సెంటర్‌లోని వినాయక ఆలయం వద్ద ఆదివారం గ్రామస్థులు సమావేశమై తమ సమస్యలను వివరించారు. సతీష్ విలువైన వాహనాల చోరీ, దూర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయించడం, తనను ప్రశ్నించిన వారిపై దాడులకు పాల్పడటం వంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. దీంతో గ్రామస్థులు భయాందోళనలకు గురవుతున్నారని, ప్రశాంతంగా జీవించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సతీష్‌పై ఇప్పటికే ఎనిమిది కేసులు ఉన్నప్పటికీ కోరంగి పోలీసులు తగిన చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపించారు. పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే మరిన్ని ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నేరాలకు పాల్పడుతున్న వ్యక్తితోపాటు అతనిని ప్రోత్సహిస్తున్న వారిపై కూడా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ పెద్దలు మల్లాడి వీరబాబు, మల్లాడి నూకరాజు, పొన్నాడ సూరిబాబు, అంకాడి నూకరాజు తదితరులు డిమాండ్ చేశారు.


### పోలీసుల వివరణ..

ఈ ఆరోపణలపై కోరంగి ఎస్ఐ పి. సత్యన్నారాయణ మాట్లాడుతూ.. సతీష్‌పై ఇప్పటికే పలు కేసులు నమోదు చేసి జైలుకు పంపినట్లు తెలిపారు. అతనిపై షీట్ కూడా తెరిచినట్లు ఎస్ఐ వెల్లడించారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని తెలిపారు.

## దాజీమాస్టర్ - కృతజ్ఞతతో ఉండండి మరియు మీ గురువుల కోసం ప్రార్థించండి



(కడప , మహి న్యూస్ సెప్టెంబర్ 6): మీకు అత్యుత్తమ గురువు ఎవరు కాగలరు?. ఈ ప్రశ్న నిరంతరం తలెత్తుతూనే ఉంటుంది. ఉపాధ్యాయుడిగా మనం ఎవరిని ప్రేమిస్తాము?. మీ పాఠశాల రోజుల నుండి మీరు ఎవరిని గుర్తు చేసుకుంటారు?. ఈ రోజున అటువంటి గురువు కోసం ప్రార్థించండి. వారి రూపాన్ని మీ మనస్సులో గుర్తుచేసుకుని, వారి ఆనందం కోసం భగవంతుడిని ప్రార్థించండి. వారు జీవించి ఉండవచ్చు లేదా ఉండకపోవచ్చు, అది ముఖ్యం కాదు, కానీ వారు ఎక్కడో ఒకచోట నిలిచే ఉంటారు. మరి అత్యుత్తమ గురువు ఎవరు కాగలరు?. ?మీరు విద్యా సంబంధితమైన ఉపాధ్యాయులు కాకపోయినా, ఎక్కడో ఒకచోట మీరు కూడా మరొకరికి గురువుగానే ఉంటారు. ఒక చిన్న పిల్లాడికి లేదా మీ స్వంత పిల్లలకు. మరి మీరు అత్యుత్తమంగా ఎలా ఉండగలరు?. నేను నేర్చుకున్న ఏకైక పాఠం ఏమిటంటే, మీరు స్వయంగా నేర్చుకునే కళను కలిగి ఉన్నప్పుడు మాత్రమే మీరు అత్యుత్తమ గురువు కాగలరు. కాబట్టి, అత్యుత్తమ విద్యార్థిగా ఉండండి.



## బండారు దత్తాత్రేయకు ఘన సన్మానం

### బంజారా యువతకు బీజేపీలో రాజకీయ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి

హైదరాబాద్: హర్యానా, హిమాచల్ ప్రదేశ్ మాజీ గవర్నర్, బీజేపీ సీనియర్ నాయకులు గౌరవ శ్రీ బండారు దత్తాత్రేయ గారిని మాజీ మంత్రి, బంజారా భీష్మ శ్రీ అమర్ సింగ్ తిలావత్ గారి ఆధ్వర్యంలో టీఏసీ సభ్యులు, బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ భట్టు నాగేశ్వరరావు నేతృత్వంలోని బృందం ఆయన నివాసంలో ఘనంగా సన్మానించింది. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా గౌరవించారు. అనంతరం జరిగిన ఆత్మీయ సమావేశంలో బీజేపీ కోసం చురుగ్గా, నిబద్ధతతో పనిచేస్తున్న బంజారా యువతకు పార్టీలో తగిన రాజకీయ అవకాశాలు కల్పించాలనే అంశంపై ప్రధానంగా చర్చించారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బంజారా యువత ప్రతిభకు, ప్రజాసేవ పట్ల వారి అంకితభావానికి గుర్తింపు ఇస్తూ, అర్హత మరియు నిబద్ధత కలిగిన యువ నాయకత్వానికి సముచిత రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని డాక్టర్ భట్టు నాగేశ్వరరావు బండారు దత్తాత్రేయ గారిని విజ్ఞప్తి చేశారు.“పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తున్న బంజారా యువతకు రాజకీయ అవకాశాలు లభిస్తే, వారి శక్తి ప్రజాసేవకు మరింత బలంగా ఉపయోగపడుతుంది” అని ఆయన పేర్కొన్నారు.‘ బంజారా యువతను రాజకీయంగా ప్రోత్సహించి, పార్టీ సంస్థాగత కార్యక్రమాల్లో మరింత బాధ్యతలు అప్పగించాల్సిన అవసరాన్ని దత్తాత్రేయ గారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విజ్ఞప్తిపై బండారు దత్తాత్రేయ గారు సానుకూలంగా స్పందిస్తూ, బంజారా సమాజానికి చెందిన అర్హత, ప్రతిభ, నిబద్ధత కలిగిన యువతకు పార్టీలో మరిన్ని అవకాశాలు లభించేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన సానుకూల స్పందన పట్ల డాక్టర్ భట్టు నాగేశ్వరరావు, బృంద సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిణామాలు, రానున్న ఎన్నికలు, బంజారా యువత రాజకీయాల్లో పోషించాల్సిన పాత్ర తదితర అంశాలపై కూడా చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్ సింగ్ తిలావత్, డాక్టర్ భట్టు నాగేశ్వరరావు, ఏఐబీఎస్ఎస్ తెలంగాణ రాష్ట్ర మీడియా సెక్రెటరీ భీముడు నాయక్, ఖతీఖు నాయకుడు వినయ్ దాస్ రోహిత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు జరిగే ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

### – జిల్లా కలెక్టర్ అంకిత్, ఐఏఎస్.

భద్రాద్రి కొత్తగూడెం స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 6. కొత్తగూడెం : నేడు సెప్టెంబర్ 7 వ తేదీ, సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్య క్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10గంటలకు హాజరుకావాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఐఏఎస్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, మరియు ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, అదేవిధంగా జిల్లాలోని అన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీలో బుడుగుల బద్రి కి కీలక బాధ్యతలు...

కూనవరం సెప్టెంబర్ 07 : పోలవరం జిల్లా బ్యూరో : అరకు పార్లమెంట్ పరిధిలోని స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీలో రంపచోడవరం నుండి కూనవరం మండలానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు బుడుగుల బద్రికి కీలక బాధ్యతలు అప్పగించారు. జనసేన పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా అని ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని బద్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టించి పనిచేసిన ప్రతి జన సైనికుడికి పార్టీలో కచ్చితంగా గుర్తింపు ఉంటుందని దానికి ఉదాహరణ నేనే అని అన్నారు. నియోజకవర్గంలోని జనసేన పార్టీ నాయకులు ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అరకు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా కొరికాన రవికుమార్ వ్యవహరిస్తుండగా సమన్వయ బృందంలో గర్భాన సత్తిబాబు వంపురి గంగులయ్య సెగ్గే భావన సాయి జయంతి ఉన్నారు. సపోర్ట్ టీమ్ లో పి కోటేశ్వరరావు ఎల్ రంజిత్ కుమార్ మంతల బుచ్చిబాబు మాధవి సంతోష్ కుమార్, చిట్లు జ్ఞానేశ్వరరావు, బుడుగుల బద్రి, పొట్ట శేఖర్ లకు పార్టీ అధిష్టానం బాధ్యతలు అప్పగించింది.

## కూనవరం లో బిజెపి మండల కమిటీ సమావేశం

కూనవరం సెప్టెంబర్ 07 : పోలవరం జిల్లా బ్యూరో: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర జిల్లా పార్టీల ఆదేశాల మేరకు ఈరోజు కూనవరం మండలం పెద్దార్కూర్ గ్రామంలో మండల అధ్యక్షులు కరక పవన్ కుమార్ మహిళా మోర్చా అధ్యక్షురాలు సోయం సుధారాణి యువమోర్చా అధ్యక్షులు పూణెం సురేష్ ఆధ్వర్యంలో మండల కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికలకు అందరూ కూటమి ప్రభుత్వం భాగస్వామ్యం తో ప్రతి ఒక్కరు ముందుకు నడవాలని ప్రతి ఒక్కరూ గ్రామపంచాయతీ స్థానిక ఎన్నికలకు పోటీకి సిద్ధంగా ఉండాలని మండల అధ్యక్షులు కరక పవన్ కుమార్ కార్యకర్తలకు కమిటీ సభ్యులకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నోముల రామారావు గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాయం వెంకయ్య హాజరై కార్యకర్తలకు కొన్ని ముఖ్యమైన సూచనలు వివరించారు భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు దేశవ్యాప్తంగా అనేకమైన సేవా కార్యక్రమాలు ఉంటాయి సేవా కార్యక్రమాల్లో పాల్గొని ప్రతి ఒక్కరు ఉత్సాహంగా సేవా పక్వాడ అనే కార్యక్రమం కు సంబంధించి నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా సేవ కార్యక్రమాలు చేయాలి కేంద్ర ప్రభుత్వం మనందరికీ నరేంద్ర మోడీ పరిపాలనలో దేశ ప్రజలకు తాను చేస్తున్న అనేక సేవ సంక్షేమ పథకాలు సేవలను గురించి ప్రతి ఒక్కరికి తెలియ చేయాలి అని వారు కార్యకర్తలకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పాయం వెంకన్న బాబు మండల ఉపాధ్యక్షులు బి.వి.ఎస్ నారాయణ మండల కార్యదర్శి మినప శ్రీను పార్టీ శ్రేణులు పూణెం ప్రసాద్ చిచ్చడి నారాయణ కారం దారయ్య సీనియర్ నాయకులు గీతా శ్రీనివాసరావు. తదితరులు పాల్గొన్నారు

## నేడు సిపిఐ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం

### గిరిజన యువతీ శిరీష హత్యోదంపై కార్యాచరణ.

### రాజకీయ, ప్రజా, సామాజిక సంఘాల ఆధ్వర్యంలో సమావేశం.

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా.

భద్రాద్రి కొత్తగూడెం స్టాఫ్ రిపోర్టర్ : సెప్టెంబర్ 6. కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం, కౌటిగూడెం గ్రామానికి చెందిన గిరిజన యువతీ హత్యా, అత్యాచారం ఘటనపై రాజకీయ, ప్రజా, సామాజిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 11.30గంటలకు సిపిఐ జిల్లా కార్యాలయం ‘శేషగిరిభవన్’లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా తెలిపారు. ఆదివారం అయన మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి ఉద్యోగం చేస్తూ కుటుంబానికి అండగా నిలుస్తున్న ఆదివాసీ బిడ్డను అత్యంత కిరాతకంగా హతమార్చడం హేయమైన చర్య అని, మానవ సమాజానికే మచ్చ అని, ఇలాంటి దారుణాలపై ప్రతిఒక్కరు స్పందించాలన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో కార్యాచరణ రూపొందించి బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగేవరకు ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. రాజకీయపక్షాలు, ప్రజా, సామాజిక సంఘాలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సాబీర్ పాషా కోరారు.

## గిరిజన భక్తులకు తిరుమల దర్శన సౌకర్యాలకు ప్రత్యేక చర్యలు

### – ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి.

రంపచోడవరం సెప్టెంబర్ 06: పోలవరం జిల్లా బ్యూరో: గిరిజన భక్తులకు తిరుమల శ్రీవారి దర్శన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి తెలిపారు. విజయవాడ పర్యటనలో భాగంగా టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. గిరిజన ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, దర్శన సౌకర్యాల అవసరంపై ఇరువురు చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, గిరిజన భక్తుల ఆధ్యాత్మిక ఆకాంక్షలను గౌరవిస్తూ వారికి సాధ్యమైనంత మేరకు దర్శన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులతో సమన్వయం చేస్తానన్నారు. మారుమూల గ్రామాల నుంచి వచ్చే భక్తులకు సరైన మార్గదర్శకత్వం, సహకారం అవసరమన్నారు. టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, గిరిజన భక్తులకు సేవలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గిరిజన ప్రజల విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, భూ సమస్యల పరిష్కారానికి త్వరలో తిరుపతి జిల్లాలో పర్యటిస్తానని చైర్మన్ తెలిపారు. సెప్టెంబర్ 7, 9 తేదీల్లో అనంతపురం, అన్నమయ్య జిల్లాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో అర్జీలు స్వీకరిస్తామన్నారు. ఈ సమావేశంలో పోలవరం జిల్లా బీజేపీ సీనియర్ నాయకులు నామాల శ్రీను, గిరిజన మోర్చా నాయకురాలు కుంజం సత్యనారాయణమ్మ పాల్గొన్నారు.

## జడ్డంగి వారపు సంతలో మహిళా చట్టాలు, గంజాయిపై అవగాహన సదస్సు.సిఐ. సన్యాసినాయుడు

రాజవొమ్మంగి సెప్టెంబర్ 07 జూమ్ ఇన్ జర్నలిస్ట్ పోలవరం జిల్లా బ్యూరో.: జడ్డంగిలో ఆదివారం జరిగిన వారపు సంతలో పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో సంతకు వచ్చిన ప్రజలకు మహిళా చట్టాలు, సైబర్ నేరాలు, గంజాయి వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు, పశువులను రోడ్లపై వదలడం వల్ల జరిగే అనర్థాలపై వివరించారు. గంజాయి సేవించడం వల్ల ఆరోగ్యం, కుటుంబం, సమాజంపై పడే ప్రతికూల ప్రభావాలను విపులంగా తెలియజేశారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT 1/702, BEHIND BHARAT PETROL PUMP, GUNTUR, A.P - 522001.PRINTED AT VSAR PUBLICATIONS, 178/1, ANJANEYA VAGU, KOTHAPETA, VIJAYAWADA (URBAN), N T R, A.P -520001. RNI NO : APTEL/26/A7632. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com